క్లుప్తంగా

ఘనంగా ఆదిశంకరాచార్యుల జయంతి

ప్రొద్దుటూరు కల్చరల్ : శ్రీఆదిశంకరార్యుల జయంతి సందర్భంగా మంగళవారం స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో ఉన్న శ్రీఆదిశంకరాచార్యుల స్వామి విగ్రహానికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేకువజామున మంగళవాయిద్యాలతో సుప్రభాత సేవ, స్వామివారికి విశేష ద్రవ్యాలతో అభిషేకం, పంచామృతాభిషేకం, వివిధ పండ్ల రసాలతో అభిషేకించి పూలతో అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. అర్చకులు సుధాకర్ శర్మ, ఆలయ అర్చకులు భానుమూర్తి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

విద్యుత్ మీటర్లకు అక్రమ వసూలు!

ప్రొద్దుటూరు : విద్యుత్ మీటర్లకు విద్యుత్ అధికారులు అక్రమ వసూలు చేస్తున్నారని సీపీఎం పట్టణ కార్యదర్శి కె.సత్యనారాయణ ఆరోపించారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ ఎవరైనా కొత్త మీటరు కావాలని దరఖాస్తు చేసుకుంటే దానికి ఒక కిలో వాట్ ప్రకారం డబ్బు చెల్లించాలన్నారు. అయితే ఇక్కడ కొందరు అధికారులు రూ.5వేల నుంచి రూ.10వేల వరకు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. పేదలు నివసిస్తున్న కాలనీలో ఏవైనా పోల్స్ మార్చాలంటే డబ్బు కట్టాలని చెబుతున్నారని పేర్కొన్నారు. సమావేశంలో శేఖర్, శివ పాల్గొన్నారు.

డీఏను వెంటనే ప్రకటించాలి



మాట్లాడుతున్న బాలజోజి

కలసపాడు : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు కరువు భత్యాన్ని (డీఏ) వెంటనే ప్రకటించాలని ఏపీటీఎఫ్ (257) మండల అధ్యక్షుడు ఇ.బాలజోజి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మూడు డీఏలను ప్రకటించగా రాష్ట్ర ప్రభుత్వం ఒక డీఏను కూడా ప్రకటించకపోవడం అన్యాయమన్నారు. 2018 నుంచి రావాల్సిన కరువు భత్యం బకాయిలను ఇంత వరకు చెల్లించలేదని, ఆ బకాయిలను వెంటనే విడుదల చేయాలని తెలిపారు. సమావేశంలో ఏపీటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి పి.కిరణ్ కుమార్, జిల్లా కౌన్సిలర్ కె.క్రిష్టారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతు భరోసా దరఖాస్తుకు 30 వరకు గడువు

మైదుకూరు : ఈనెల 30వ తేదీలోపు రైతు భరోసా కింద సాయం లబ్ధి పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి పి.లక్ష్మీప్రసన్న ఒక ప్రకటనలో తెలిపారు. పాసుపుస్తకాలు కొత్తగా మంజూరైన వారు, చనిపోయిన వారిలో భార్య, భర్త నామినీగా ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని వివరించారు. పీఎం కిసాన్ ఈకేవైసీ పెండింగ్‌లో ఉన్నవారు వెంటనే చేయించుకోవాలని సూచించారు. పసుపు కొనుగోలు కోసం ఈనెల 27లోపు రైతులు తమ పేర్లను ఆయా రైతు భరోసా కేంద్రాల్లో నమోదు చేయించుకోవాలని ఏఓ తెలిపారు.

తహసీల్దార్‌గా ఈశ్వరయ్య బాధ్యతల స్వీకరణ



బ్రహ్మంగారిమఠం : బ్రహ్మంగారిమఠం తహసీల్దార్‌గా ఈశ్వరయ్య మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని రెవెన్యూ, ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

ఆంధ్రరత్న పురస్కారం అందుకున్న ప్రభాకర్



ఎం.ప్రభాకర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరుకు చెందిన డాక్టర్ ఎం.ప్రభాకర్ హైదరాబాద్ శ్రీపొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో సోమవారం జరిగిన సాంస్కృతిక మహోత్సవంలో ఆంధ్రరత్న పురస్కారం అందుకున్నారు. సాహితీ రంగంలో చేసిన కృషికి గానుఈయనకు ఈ పురస్కారం వరించింది.

1 నుంచి భగవద్గీత శ్లోకాలపై శిక్షణ

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వెంకటేశ్వర్లపేటలోని బ్రహ్మశ్రీ జగద్గురు వేదాంతం లక్ష్మణార్యుల ఆశ్రమంలో మే 1 నుంచి జూన్ 2వ తేదీ వరకు శ్రీమద్భాగవద్గీత 18 అధ్యాయాలపై ఉచిత శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు ఆశ్రమ అధ్యక్షుడు వద్ది నరసింహులు ఒక ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలకు 9440074989, 9440203862 సెల్‌నంబర్లలో సంప్రదించాలని కోరారు.

దోమల నివారణతోనే వ్యాధుల కట్టడి



ప్రొద్దుటూరు క్రైం: ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్, వైద్యాధికారులు



బద్వేలు అర్బన్: ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య, మెప్మా సిబ్బంది



చాపాడు: కాలువలో అబెట్ ద్రావణాన్ని చల్లుతున్న వైద్య సిబ్బంది

ప్రొద్దుటూరు క్రైం : దోమల వ్యాప్తి నివారణతోనే వ్యాధులను కట్టడి చేయవచ్చని డాక్టర్ సునీల్‌కుమార్ తెలిపారు. ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవం సందర్భంగా స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి మంగళవారం అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సునీల్‌కుమార్, అసిస్టెంట్ కమిషనర్ రంగస్వామి మాట్లాడుతూ లార్వా పెరగకుండా ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. ఇంటి పరిసరాలలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని తెలిపారు. నీటి కుంటల్లో కిరోసిన్ లేదా వేస్ట్ ఆయిల్‌ను వెయ్యాలన్నారు. వైద్యాధికారి మార్టిన్, మండల హెల్త్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాసులు, సూపర్ వైజర్ జయమ్మ, సీఓలు సుబ్బారెడ్డి, వెంకటసుబ్బమ్మ పాల్గొన్నారు. అలాగే వైఎంఆర్ కాలనీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో, శ్రీనివాస నగర్ అర్బన్ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో ర్యాలీలు నిర్వహించారు. మలేరియా వ్యాధి లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వైద్యులు వివరించారు. కమ్యూనిటీ ఆర్గనైజర్ ఎంవీ సుబ్బారెడ్డి, డాక్టర్ దినేష్‌బాబు, వైద్యశాఖ అధికారులు వెంకటేశ్వర్లు, నాగజ్యోతి హెల్త్ సెక్రటరీలు ఆశా వర్కర్లు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు. తదితరులు పాల్గొన్నారు.

దోమలను అరికట్టండి

ప్రొద్దుటూరు కల్చరల్ : దోమలను అరికట్టి మలేరియా నుంచి రక్షణ పొందాలని డాక్టర్ బి.శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. మండలంలోని తాళ్లమాపురం గ్రామంలోని జెడ్పీ హైస్కూల్‌లో ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులకు దోమల నుంచి మలేరియా నివారణ అనే అంశంపై వక్తృత్వ, వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందించారు. డాక్టర్ శివప్రసాద్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు గోపీనాథ్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దోమల నివారణతో మలేరియా దూరం

బద్వేలు అర్బన్ : దోమల నివారణతో మలేరియాను దూరం చేయవచ్చని, ఇందుకోసం ప్రతి ఒక్కరూ దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన పెంచుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ వై.చంద్రహాసరెడ్డి, మున్సిపల్ కమిషనర్ కె.వి.కృష్ణారెడ్డిలు పేర్కొన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక జెడ్పీ హైస్కూల్ నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు వైద్య సిబ్బంది, మెప్మా సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత, నీరు నిల్వ లేకుండా డ్రైడే పాటించడం ద్వారా దోమల నివారణ చేయవచ్చన్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో దోమతెరలు వాడాలని సూచించారు. విపరీతమైన చలి, జ్వరం, వాంతులు, తలనొప్పి వంటి లక్షణాలు ఉంటే వెంటనే సమీప ఆరోగ్య కేంద్రంలో రక్తపరీక్షలు చేయించుకుని మలేరియా నిర్ధారణ తర్వాత 14 రోజులు చికిత్స తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో తొట్టిగారిపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ జోత్స్న స్వర్ణలత, డాక్టర్ వినయ్‌కుమార్, మండల విస్తరణాధికారి భానుప్రసాద్, మెప్మా టీఎంసీ అయ్యవారయ్య, హెల్త్ ఎడ్యుకేటర్ వెంగయ్య, సూపర్‌వైజర్ వెంకటమ్మ, హెల్త్ అసిస్టెంట్లు జనార్దన్‌రావు, శ్రీరాములయ్య, ఖాసిం, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

మలేరియా దినోత్సవంపై ర్యాలీ

అట్లూరు : ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా మంగళవారం మండల కేంద్రమైన అట్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ కె.హమీదా బేగం ఆధ్వర్యంలో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఇంటి పరిసరాలలో, గుంతలలో నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని, దోమల ఉత్పత్తి, దోమల లార్వా ఉత్పత్తిని అరికట్టాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ సి.మురళీకృష్ణ, సూపర్‌వైజర్లు ఎం.వీరేంద్రబాబు, ఎస్.వి.ప్రసాద్, బ్రహ్మారెడ్డి, జీ.మాణిక్యమ్మ, వైద్య సిబ్బంది లత, సురేష్, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

అవగాహనతోనే మలేరియా వ్యాప్తికి అడ్డుకట్ట

చాపాడు: మలేరియా వ్యాప్తిని అవగాహనతో అరికట్టవచ్చని మండల వైద్యాధికారి డాక్టర్ రాజేష్ కుమార్ పేర్కొన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా మండల కేంద్రమైన చాపాడులో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. మలేరియా వ్యాధి వ్యాప్తి, నివారణ పట్ల ప్రజలకు అవగాహన కలిగించారు. వైద్యాధికారి రాజేష్ కుమార్ మాట్లాడుతూ.. ప్రతి కుటుంబం శుక్రవారం రోజున డ్రైడే పాటించాలన్నారు. ఇళ్ల పరిసరాలతో పాటు ఇంటిని పరిశుభ్రత చేసుకోవాలని, నాలుగు రోజులకు మించి నీటిని నిలువ చేసుకోరాదన్నారు. అధిక రోజులు నీటి నిలువల వలన దోమల వ్యాప్తి జరుగుతుందన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల శుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు ఓబులేసు, కావ్య, సీహెచ్‌ఓ రాముడు, సూపర్‌వైజర్ సరస్వతి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మొర్రాయిపల్లెలో..

మండలంలోని సోమాపురం గ్రామ సచివాలయ పరిధిలోని మొర్రాయిపల్లె గ్రామంలో మంగళవారం ప్రపంచ మలేరియా దినోత్సవ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ శ్రీవాణి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. వైద్య సిబ్బంది గ్రామంలోని వీధుల వెంట ర్యాలీ చేపట్టి మలేరియా వ్యాధి నివారణ పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు.

కాశినాయన మండలంలో..

కాశినాయన : ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా మంగళవారం నరసాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ప్రశాంతి ఆధ్వర్యంలో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. మలేరియా వ్యాధిపై నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ వీధుల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, ప్రతి ఒక్కరు దోమతెరలు వాడాలని, ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారులు శ్రీనివాసులరెడ్డి, సుబ్బరాయుడు, ఆరోగ్య పర్యవేక్షకులు బాలయ్య, నాగమణి, వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

నేటి నుంచి గంధ మహోత్సవాలు

మైదుకూరు : మండలంలోని నంద్యాలంపేటలో బుధవారం నుంచి మా సాహెబా దర్గాలో గంధం మహోత్సవాలు నిర్వహించనున్నారు. మైదుకూరు – బద్వేలు రహదారిపై నంద్యాలంపేట వద్ద ఉన్న హజరత్ అష్రఫే–దోజహా–ఆరా– మా సాహెబా – కుడిచి వారి ఖాద్రి చిష్టి వారికి బుధవారం నిషాన్, గురువారం గంధం నిర్వహిస్తారని పీఠాధిపతులు తెలిపారు. జీవీ సత్రం నివాసి పఠాన్ సత్తార్‌ఖాన్ ఇంటి నుంచి 27న ఉదయం 10 గంటల నుంచి గంధం బయలు దేరుతుందని పేర్కొన్నారు. ఉత్సవాల్లో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

27న గంగాజయంతి ఉత్సవాలు



ప్రత్యేక అలంకరణలో గంగమ్మ

రాజుపాళెం : మండలంలోని అర్కటవేముల గ్రామంలో వెలసిన పురాతన పాత గంగమ్మ ఆలయంలో ఈనెల 27న గురువారం నుంచి జయంతి ఉత్సవాలను నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. 26న బుధవారం సాయంత్రం ఆలయ శిఖర కలశప్రతిష్ట, హోమం, పూజా కార్యక్రమాలు ఉంటాయన్నారు. గంగా జయంతి సందర్భంగా అమ్మవారికి మకర తోరణం, ఆలయ శిఖర కలశ ప్రతిష్ట అభిషేకాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. గురువారం మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం, రాత్రికి భజన కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

జగనన్న కాలనీలో ఆక్రమణల పరిశీలన



సిబ్బంది ద్వారా వివరాలు తెలుసుకుంటున్న ఆర్డీఓ వెంకటరమణ

పోరుమామిళ్ల : మండలంలోని రంగసముద్రం పంచాయతీలో జగనన్న కాలనీని ఆర్డీఓ ఆకుల వెంకటరమణ మంగళవారం పరిశీలించారు. కాలనీలో అక్రమాలు చోటు చేసుకున్నాయని, ప్లాట్లు అన్యాక్రాంతమయ్యాయని దీనికి తహసీల్దారు సహకరించారని వచ్చిన ఆరోపణలపై ఆయన క్షేత్రస్థాయి విచారణలో భాగంగా కాలనీకి వచ్చారు. రికార్డుల ప్రకారం ఏఏ ప్లాటు ఎవరి పేరు మీద రిజిస్టర్ అయ్యింది. ఎవరికి కేటాయించని ప్లాట్ల వివరాలు, లబ్ధిదారులకు కేటాయించిన ప్లాట్లను ఇతరులకు బదిలీ అయ్యాయా అనే వివరాలు ఆర్డీఓ పరిశీలించారు. పూర్తిస్థాయి విచారణ అనంతరం అక్రమాలు రుజువైతే చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. దీనిపై ఆర్ఐ యానాదయ్యను వివరణ కోరగా ఆయన మాట్లాడేందుకు నిరాకరించారు. వీఆర్ఓ రామలక్షుమ్మను అడిగితే పది ప్లాట్లు ఖాళీగా ఉన్నాయని, ఆక్రమణలపై రెండు రోజుల్లో నివేదిక తయారు చేస్తామన్నారు. ఆయన వెంట హౌసింగ్ డీఈ రాజారత్నం, ఏఈ రమేష్‌బాబు, ఆర్ఐ యానాదయ్య, వీఆర్ఓ రామలక్షుమ్మలు ఉన్నారు.

పోలీసులు ఆరోగ్యంపై దృష్టి సారించాలి




వైద్య పరీక్షలు చేయించుకుంటున్న అర్బన్ సీఐ వెంకటేశ్వర్లు

బద్వేలు అర్బన్ : విధి నిర్వహణలో తీరిక ఉండని పోలీసులు తమ ఆరోగ్యంపై కూడా దృష్టి సారించాలని అర్బన్ సీఐ జి.వెంకటేశ్వర్లు, రూరల్ సీఐ హనుమంతనాయక్‌లు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక అర్బన్ స్టేషన్ ఆవరణలో జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఆదేశాల మేరకు పోలీసుశాఖ కడప యూనిట్ వైద్యులు వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. సిబ్బందికి, వారి కుటుంబ సభ్యులకు పలు పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. ఈ సందర్భంగా సీఐలు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యం కాపాడుకోవడానికి క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని కోరారు. అలాగే ప్రతి మూడు నెలలకొకసారి హెల్త్ చెకప్ చేయించుకోవాలని, తద్వారా ఏవైనా సమస్యలు ఉంటే ముందస్తు వైద్యం చేయించుకునేందుకు వీలుంటుందని తెలిపారు. పోలీసులు ఆరోగ్యపరంగా, మానసికంగా దృఢంగా ఉన్నప్పుడే కఠినమైన విధులను సైతం సునాయాసంగా నిర్వహించగలరని పేర్కొన్నారు. కార్యక్రమంలో పోలీసుశాఖ కడప యూనిట్ వైద్యురాలు డాక్టర్ మేరీ సుజాత, ఆయా స్టేషన్ల ఎస్ఐలు, ఏఎస్ఐలు, పోలీసు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయులపై వేధింపులు మానుకోవాలి

బద్వేలు అర్బన్ : పాఠశాలల సందర్శన పేరుతో పాఠశాల విద్య ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ ఉపాధ్యాయులపై వేధింపులకు పాల్పడటం మానుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) జిల్లా చైర్మన్ ఎం.విజయకుమార్ అన్నారు. ఫ్యాప్టో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం చిన్నకేశంపల్లె జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. అనంతరం మధ్యాహ్నం జరిగిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పాఠశాల విద్య ముఖ్య కార్యదర్శి పాఠశాలలను సందర్శించడాన్ని స్వాగతిస్తున్నామని, అయితే పాఠశాలల్లోని సమస్యలను పట్టించుకోకుండా కేవలం ఉపాధ్యాయులను మాత్రమే టార్గెట్ చేస్తూ సస్పెన్షన్ల పేరుతో భయభ్రాంతులకు గురిచేయడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుల సంఘం నాయకుడు రమణయ్య, యూటీఎఫ్ జిల్లా నాయకులు శశిధర్‌కుమార్, ఆయా ఉపాధ్యాయ సంఘాల నాయకులు చెన్నకేశవరెడ్డి, సుబ్రమణ్యం, సురేష్‌రవికుమార్, పెంచలయ్య పాల్గొన్నారు.

అధికారులను అభినందించిన ఎంపీపీ



అధికారులను అభినందిస్తున్న ఎంపీపీ వీరనారాయణరెడ్డి

బ్రహ్మంగారిమఠం : వివిధ ప్రభుత్వ పథకాల అమలు, విధి నిర్వహణలో ప్రతిభ చూపిన ఎంపీడీఓ, డీఎల్‌డీఓ వెంగమునిరెడ్డి, ఏఓ రామానుజం, సీనియర్ అసిస్టెంట్ మల్లికార్జునలను ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి తన కార్యాలయంలో మంగళవారం అభినందించారు. వీరు సోమవారం కలెక్టర్ విజయరామరాజు, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి నుంచి ప్రశంసాపత్రాలను అందుకున్న విషయం తెలిసిందే.

వైభవంగా శ్రీ భద్రావతి భావనా ఋషి కల్యాణం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

కడప కల్చరల్ : కడప నగరం హనుమప్ప వీధిలోని శ్రీ భద్రావతి భావనా ఋషి ఆలయంలో మంగళవారం స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. మార్కెండేయ సుతుడు భావ నారాయణునికి సూర్యుడు, ఛాయాదేవిల కుమార్తె భద్రావతి దేవికి ఈ కల్యాణం నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం, విష్ణు సహస్ర నామ పారాయణం, మూలవర్లకు కల్యాణ మూర్తులుగా విశేష అలంకారం చేసి పెళ్లి పీటలపై కొలువుదీర్చారు. వేద పండితుల మంత్రోచ్చాటనల మధ్య కల్యాణ క్రతువును క్రమంగా నిర్వహించారు. సాయంత్రం సామూహికంగా లలితా సహస్ర నామ పారాయణం, కుంకుమార్చన చేశారు. రాత్రి కల్యాణమూర్తులను స్థానిక వీధుల్లో పల్లకీపై ఊరేగించారు.

సంక్షేమ పథకాలతో పేదల జీవితాల్లో వెలుగు

ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి

మైదుకూరు : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేదల జీవితాల్లో వెలుగు నింపుతున్నాయని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మైదుకూరులోని వైఎస్సార్‌సీపీ నాయకుడు ముజాఫర్ ఇంటిలో విలేకరులతో మాట్లాడారు. తాము అధికారంలో ఉన్నా అభివృద్ధి చేశాం కాబట్టే గడపగడపకు వెళ్లి ప్రజలను కలుస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. గత ప్రభుత్వం కంటే ఈ ప్రభుత్వంలో మీకు మేలు జరిగిందా లేదా మధ్యవర్తులు లేకుండా చేయూత, ఆసరా, అమ్మ ఒడి, రైతు భరోసా వంటి పథకాల ద్వారా నేరుగా మీకు లబ్ధి చేకూరుతోందా లేదా, తిరిగి ఈ పథకాలు కొనసాగించాలని కోరుకుంటున్నారా అని తాము ప్రజలను అడుగుతున్నామన్నారు. మొత్తం మీద 99 శాతం మంది సంక్షేమ పథకాలను కొనసాగించాలని కోరుతున్నారన్నారు. మైదుకూరు నియోజకవర్గంలో 84వేల కుటుంబాలుండగా ఇప్పటికే 60 వేల కుటుంబాలను కలిశామని తెలిపారు. మరో 20వేల కుటుంబాలను కలవడమే లక్ష్యమన్నారు.

లోకేష్ ప్రకటన సిగ్గు చేటు

తాము అధికారంలోకి వస్తే వలంటీర్లు, సచివాలయ వ్యవస్థలను కొనసాగిస్తామని లోకేష్ చెప్పడం సిగ్గుచేటని ఎమ్మెల్యే రఘురామిరెడ్డి విమర్శించారు. సచివాలయ వ్యవస్థతో నిధులు వృథా అవుతున్నాయని కోర్టుకు వెళ్లి, ఇప్పుడు కొనసాగిస్తామని ఎలా చెబుతున్నారని ప్రశ్నించారు. సీఎం వైఎస్ జగన్ లక్షా 33 వేల మందికి సచివాలయాల్లో ఉద్యోగాలిచ్చారన్నారు. చంద్రబాబు నిరుద్యోగ భృతి ఇస్తామని ఇవ్వకుండా మోసం చేశారని ధ్వజమెత్తారు. ఐదేళ్లలో టీడీపీ ప్రజలకు ఏం చేసిందో చెప్పాలన్నారు. ఏపీ ఐబీసీ డైరెక్టర్ డి.గంగాధర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర, బి.మఠం, చాపాడు, ఖాజీపేట ఎంపీపీలు సి.వీరనారాయణరెడ్డి, తెలిదేల లక్షుమయ్య, అబుబకర్ సిద్ధిఖ్, జెడ్పీకోఆప్షన్ సభ్యుడు అచ్చుకట్ల కరీముల్లా, మైదుకూరు, చాపాడు మండలాల కన్వీనర్లు పాల్గొన్నారు.

అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి సంక్షేమ లబ్ధి

ఖాజీపేట : అర్హత కల్గిన ప్రతి కుటుంబానికి సీఎం జగన్ ప్రభుత్వం సంక్షేమ ఫలాలు అందిస్తోందని ఎమ్మెల్యే రఘురామిరెడ్డి అన్నారు. ఖాజీపేట మండలం నాగసానిపల్లె పంచాయతీలో మంగళవారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే రఘురామిరెడ్డి ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం సమక్షేమ ఫలాలను వివరించారు. సంక్షేమ ఫలాలు అందుకున్న వారు తమ సంతోషాన్ని ఎమ్మెల్యే వద్ద వెలుబుచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్నాం అన్నారు. గతంలో టీడీపీ పాలనలో ఇచ్చిన హామీలను అమలు చేకుండా ప్రజలను మోసం చేశారన్నారు. రైతు భరోసా కేంద్రాలను గ్రామాల్లో ఏర్పాటు చేయడం ద్వారా రైతులకు ఎంతో మేలు జరుగుతోందన్నారు. నేడు మీ గ్రామాల్లోనే పాలన జరుగుతోందన్నారు. గ్రామాల ముంగిటకు పాలన తీసుకు వచ్చిన ఘనత సీఎం జగన్‌దే అన్నారు. కార్యక్రమంలో ఏపీఐబీసీ డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి, ఎంపీపీ అబుబకర్ సిద్ధిక్, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యుడు అచ్చుకట్ల కరీముల్లా, అగ్రహారం సొసైటీ అధ్యక్షుడు రాఘవరెడ్డి, నాగసానిపల్లె సర్పంచ్ సక్కా రమాదేవి, ఎంపీటీసీ సుహాసినీచ నాగసానిపల్లె నాయకుడు సధాకర్, ఆంజనేయకొట్టాలు సర్పంచ్ పెద్దిరెడ్డి, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ మురళీమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విచారణ ఏడాదికా ?

ప్రొద్దుటూరు : ఫిర్యాదు చేసిన దాదాపు ఏడాది కాలానికి స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారులు విచారణకు ఆదేశించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఫలితం ఏవిధంగా ఉన్నా సకాలంలో విచారణ చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. ప్రొద్దుటూరు ఐసీడీఎస్ రూరల్ ప్రాజెక్టు పరిధిలో పనిచేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త రమాదేవి గత ఏడాది మే 27న మృతి చెందారు. అధికారుల వేధింపుల వల్లే కార్యకర్త మృతి చెందడం జరిగిందని, సీడీపీఓ నిర్మలాదేవి అవినీతికి పాల్పడ్డారని సీడీపీఓ కార్యాలయం నుంచి డైరెక్టరేట్ వరకు పలుమార్లు ఫిర్యాదు చేశారు. ఇంతకాలానికి విచారణ చేయనున్నారు. బుధవారం ఉదయం స్థానిక ఎన్జీఓ హోంలో కర్నూలు రీజనల్ జాయింట్ డైరెక్టర్ పద్మజ విచారణ చేపట్టనున్నారు.

బ్యాంకింగ్‌పై విద్యార్థులకు అవగాహన

పోరుమామిళ్ల : బ్యాంకింగ్ కార్యక్రమాలపై డిగ్రీ విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు మంగళవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల వాణిజ్య విభాగం ఆధ్వర్యంలో క్షేత్ర పరిశీలన నిర్వహించారు. బ్యాంకింగ్ ఖాతాల నిర్వహణ, కరెంట్, సేవింగ్ అకౌంట్స్, డిపాజిట్ల స్వీకరణ, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, వివిధ రకాల రుణాల మంజూరు, నగదు రహిత వ్యవహారాల నిర్వహణ, గోల్డ్ లోన్స్, నగదు బదిలీలు తదితర అంశాలపై పట్టణంలోని డీసీసీ బ్యాంకులో విద్యార్థులకు అవగాహన కల్పించారు. పరిశీలనాత్మక విద్యలో భాగంగా విద్యార్థులను క్షేత్రపర్యటనకు తెచ్చినట్లు అధ్యాపకులు వివరించారు. కార్యక్రమంలో వాణిజ్య విభాగం హెడ్ శ్రీనివాసులు, అధ్యాపకులు ఈశ్వరయ్య, నరసయ్య, రవిచంద్ర, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

దువ్వూరు : మండల పరిధిలోని జిల్లెల్ల గ్రామంలో మంగళవారం ఆరోగ్య కుటుంబ విధానం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 70 మందిని పరీక్షించి వారికి అవసరమైన మందులను ఉచితంగా అందించారు. అనంతరం ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. పరిసరాలను పరిశుభ్రతతో అనారోగ్యాల బారిన పడకుండా ఉండవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

సమాఖ్య అభివృద్ధికి పాటుపడాలి



మాట్లాడుతున్న జిల్లా పథక సంచాలకులు ఆనంద్‌నాయక్

రాజుపాళెం : వైఎస్సార్ క్రాంతిపథం మండల సమాఖ్య ద్వారా స్వయం సహాయక సంఘాలకు అందించే రుణాల రికవరీ పెంచి సమాఖ్య అభివృద్ధికి పాటుపడాలని జిల్లా పథక సంచాలకులు ఆనంద్‌నాయక్ తెలిపారు. మండల కేంద్రమైన రాజుపాళెంలోని మండల వైఎస్సార్ క్రాంతి సభాభవనంలో మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వయం సహాయక సంఘాల గ్రూపులకు వివిధ పథకాల ద్వారా అందించే రుణాలు మహిళల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు అందించాలన్నారు. మండలంలో గ్రూపుల నిర్వహణ, రుణాల మంజూరులో పనితీరు బాగుందని కొనియాడారు. ఆసరా, స్త్రీ నిధి, కమ్యూనిటీ ఇన్‌వెస్ట్‌మెంట్ ఫండ్, హౌసింగ్ రుణాలు, జగనన్న తోడు, లక్‌పతి దీదీ వెలుగు పథకం, అమలు చేస్తున్న కార్యక్రమాలపై వీఓఏలతో సమీక్షించారు. వైఎస్సార్ క్రాంతి పథం ఏరియా కో–ఆర్డినేటర్ లావణ్య, స్త్రీనిధి మేనేజర్ నాగేంద్రబాబు, ఏపీఎం జయరాజు, సీసీలు, వీఓఏలు, అకౌంటెంట్లు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రాచమల్లుకు సన్మానం



ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డిని సన్మానిస్తున్న ఉప్పరపల్లె గ్రామస్తులు

ప్రొద్దుటూరు : చాలా ఏళ్ల తర్వాత తమ గ్రామానికి రోడ్డు వేయించి పుణ్యం కట్టుకున్నారని ప్రొద్దుటూరు మండలంలోని ఉప్పరపల్లె గ్రామస్తులు మంగళవారం ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డిని కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చాలా కాలంగా రోడ్డు మరమ్మతులకు నోచుకోకపోవడంతో అటు రైతులు, ఇటు గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడేవారన్నారు. తమ సమస్య తీవ్రతను గమనించి ఎమ్మెల్యే చొరవ చూపినందుకు కృతజ్ఞతలు తెలిపారు. సర్పంచ్ సానపురెడ్డి రమణారెడ్డి, ఎంపీటీసీ మాధవి, సమర్థనారాయణస్వామి ఆశ్రమ నిర్వాహకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు

ప్రొద్దుటూరు : తన కాలు ఆపరేషన్ కోసం ఆర్థికసాయం చేసి ఆదుకున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రాదరెడ్డికి స్థానిక 33వ వార్డుకు చెందిన లక్ష్మి కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం ఎమ్మెల్యేను కలిసిన అనంతరం ఆమె మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే తమ ఇంటికి వచ్చినప్పుడు సమస్యను వివరించానన్నారు. పెద్దమనసుతో స్పందించిన ఎమ్మెల్యే తిరిగి మా ఇంటికి వచ్చి రూ.2.50 లక్షలు ఇచ్చారన్నారు. మాజీ కౌన్సిలర్ అగ్గారపు శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ నాయకురాలు గుమ్మళ్ల పద్మావతి, వలంటీర్లు పాల్గొన్నారు.

సచివాలయాల్లో స్పందన ఫిర్యాదులు ఇవ్వాలి

ప్రొద్దుటూరు : ప్రజలు వివిధ సమస్యల పరిష్కారానికి సంబంధించి స్పందన ఫిర్యాదులను తమ పరిధిలోని గ్రామ, వార్డు సచివాలయాల్లో ఇవ్వాలని తహసీల్దార్ నజీర్ అహ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజు మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు ఉద్యోగులు అందుబాటులో ఉండి స్పందన ఫిర్యాదులు స్వీకరిస్తారని ఆయన పేర్కొన్నారు. రెవెన్యూ, మండల పరిషత్, హౌసింగ్, పోలీస్‌తో ఇతర శాఖలకు సంబంధించి అర్జీలను పనిదినాలలో సచివాలయానికి వెళ్లి ఇవ్వొచ్చని తెలిపారు. అక్కడ సమస్య పరిష్కారం కాకపోతే డివిజన్ పరిధిలోని అధికారులకు, డివిజన్ పరిధిలో పరిష్కారం కాకపోతే జిల్లా కలెక్టర్ కార్యాలయానికి అర్జీలు సమర్పించాలని కోరారు. ప్రజలందరూ ఇక నుంచి ఈ విషయాన్ని గమనించి తమ సచివాలయాల్లో మాత్రమే పరిష్కరించుకోవాలని తెలిపారు.